**International Journal of Research in Social Sciences and Humanities** http://www.ijrssh.com

(IJRSSH) 2014, Vol. No. 4, Issue No. I, Jan-Mar **ISSN: 2249-4642**

# వార / మాస పత్రికలు - సాహిత్య సేవ

# VARA MAASA PATHRIKALU - SAHITYA SEVA

**జి. సుకన్య, తెలుగుశాఖ, ప్రభుత్వ సిటీ కళాశాల, హైదరాబాద్.**

**G.Sukanya**

*Department of Telugu, Government City College, Hyderabad.*

## ABSTRACT

*It is not an exaggeration to say that the newspapers of that time are credited with having perfumed the poetry of the national movement at its birth. The Sahitya Seva of weekly and monthly periodicals have been praised in the world of Telugu literature. There is an inextricable relationship between literature and society. Literature tries to reflect the changes in the society.*

*"Society is the strongest reason for the birth of a poet" said Acharya G.V. Subrahmanyam's words show the connection of literature with society. Similarly, Narla's words that "Patrikokkatunna chalu ten vela sainyamu" express the necessity of a newspaper in Kaloji's words "Okka Sirachukka Lakh Medalla Mukuru".*

**"పువ్వుపుట్టగానే పరిమళించినట్లు"** జాతీయోద్యమ కవిత్వం పుట్టగానే పరిమళింపజేసిన ఘనత ఆనాటి పత్రికలదే అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. తెలుగు సాహితీ లోకంలో వార, మాస పత్రికల సాహిత్య సేవ శ్లాఘనీయమైంది. సాహిత్యానికి, సమాజానికి అవినాభావ సంబంధం కలదు. సమాజంలో కలిగే మార్పులను సాహిత్యం ప్రతిబింబించేందుకు ప్రయత్నిస్తుంది.

''**సమాజమే కవి పుట్టుటకు బలమైన హేతువ**'' అని ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారి మాటలు సమాజంతో సాహిత్యానికున్న అనుబంధాన్ని తెలియజేస్తున్నాయి. అదేవిధంగా "పత్రికొక్కటున్న చాలు పదివేల సైన్యము" అన్న నార్ల వారి మాటలు "ఒక్క సిరాచుక్క లక్ష మెదళ్ళ కదలిక" అన్న కాళోజీ మాటలలో వార్తా పత్రిక యొక్క ఆవశ్యకతను తెలియజేస్తున్నాయి.

**"కత్తికన్నా కలం గొప్పదన్నారు"** కవుల కలం ద్వారా జాలువారిన గీతికలే స్వాతంత్ర్యోద్యమంలో ప్రజలను చైతన్యవంతుల్ని చేశాయి. బ్రిటిష్ పాలకుల పరిపాలనలో అరాచకాలు, అన్యాయాలు, దోపిడీలు అధికమై వారి ఆగడాలను సహించలేక ప్రజలందరూ ఏకమై బ్రిటిష్ వారిపై నిరసనను తెలియజేశారు. ఈ నిరసననే రానురాను ఆందోళనగా మారి ఉద్యమరూపాన్ని దాల్చింది. ఈ ఉద్యమాలన్ని వ్యక్తి ప్రాతిపదికపై నిర్మితం కావు. సిద్ధాంతప్రాతిపదికపైనే నిర్మితమవుతాయి. ఈదృష్టితో చూసినట్లయితే తెలుగునేలపై అనేక ఉద్యమాలు జాతీయోద్యమం, ఆంధ్రోద్యమం, తెలంగాణ

(IJRSSH) 2014, Vol. No. 4, Issue No. I, Jan-Mar ISSN: 2249-4642

రైతాంగపోరాటం, వామపక్ష ఉద్యమం, దళిత ఉద్యమం మొదలైనవి ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఈ ఉద్యమాలన్ని కూడా సాహిత్య ప్రక్రియలపై తమతమ ప్రభావాన్ని చూపాయి. ఈ ఉద్యమ కవిత్వంలో పత్రికల యొక్క పాత్ర అమోఘమైంది, అనిర్వచనీయమైంది.

ఈ ఉద్యమాలలో పత్రికల సేవను పరికించి చూసినట్లయితే 19వ శతాబ్దికి పూర్వమే పత్రికలు ఉద్యమ సాహిత్యానికి విశేష కృషిని అందించాయి. 1872 నాటికే బందరులో ఉమారంగనాయకులు గారు "పురుషార్థప్రదాయిని" అనే పత్రికను స్థాపించారు. ఈ పత్రికద్వారానే వీరేశలింగం పంతులుగారి తొలిరచనలు ముద్రింపబడ్డాయి.

వీరేశంలింగం పంతులు గారి దృష్టి ఆనాటి రాజకీయాలపై కాకుండా సాంఘిక సంస్కరణలపై పడడం విశేషం. వీరి సంస్కరణోద్యమానికి కేంద్రస్థానమైన రాజమండ్రి నుండి వీరు ఆనాటి పత్రికలైన **"వివేకవర్ధిని (1874)", హాస్యసంజీవని (1876), సతీహితబోధిని (1883), సత్యసంవర్ధిని (1891), తెలుగు జనని, సత్యవర్ధిని (1905)** అనే పత్రికల ద్వారా సంఘసంస్కరణ ఆశయాలను జాతీయతాభావాలను, దేశీయాభిమానాన్ని జాగృతం చేయడానికి కృషి చేశారు.

**"సత్యవర్ధిని", "సతీహితబోధిని''** లో స్త్రీలకు సంబంధించినవి. ''సత్యసంవర్ధిని'' యోగాభ్యాసం, హిందూమతం విద్యాధికుల ధర్మాలు మొదలైనవి, "సత్యవాదిని"లో సాంఘిక సమస్యలు, రాజకీయ సంస్కరణలు మొదలైనవి **"తెలుగు జనని"**లో భౌతిక భూగోళశాస్త్రం, విదేశీ నియమాలు, చరిత్రలు మొదలైనవి ప్రచురించారు.

షేక్స్ ఫియర్ రచించిన "ది కామెడి ఆఫ్ ఎర్రర్స్"ను కందుకూరి వారు అనువాదం చేసి 1875 వివేకవర్ధినిలో ద్విపదలో ప్రచురించారు.

బంకించంద్రచటర్జీగారి "వందేమాతరం" గీతం చేత ప్రభావితుడైన ఒక అజ్ఞాత కవి 15 డిసెంబర్ 1905 నాటి "కృష్ణాపత్రికలో", "ది క్రైన్ ఆఫ్ మదర్ ఇండియా" అనే శీర్షికతో ఒక గొప్ప ప్రబోధాత్మక గీతాన్ని ప్రచురించారు.

**"హిందువులారా! ఎన్నాళ్లీ గతి**<br>
**మందమతులరై మాటికి చెడెదరా**<br>
**నందనులగు మీరందరు స్రుక్కగా**<br>
**ఎందుకు నా బ్రతుకితరుల కోసమా?**<br>
**దూడనోరు గొట్టిన ద్రోహంబు గొల్లలు**<br>
**పాడి సమస్తము పరులకమ్ము గతి**<br>
**కూడు లేనినా**<br>
**కొడుకులగాదని**<br>
**యేడకో నాధన మెల్లను బోయెడి"**

IJRSSH

అంటూ సాగిన ఈ గీతం నిద్దురపోతున్న భారతీయతను నిద్దురలేపి తనపై ప్రేమజూపమని దేశమాత చేసిన ఆక్రందననే "ఈ క్రైస్ ఆఫ్ మదర్ ఇండియా" ఇంతటి చక్కటి సందేశాత్మక గీతాన్ని రాసిన కవి అజ్ఞాతంగా మిగిలిపోవడం మన దురదృష్టం. జాతీయోద్యమ సాహిత్యంలో ఈ గీతం తొలిగీతంగా పరిణమించింది. 1907లో చిలకమర్తి లక్ష్మీ నరసింహం పంతులుగారు ఆశువుగా చెప్పిన "భరత ఖండంబు చక్కని పాడియావు" అనే తేటగీతి పద్యానికి ప్రేరణ కూడా ఈ గీతంలో కనబడుతుంది.

**''దూడనేరు గొట్టిన ద్రోహంబు గొల్లలు**
**పాడి సమస్తము పరులకమ్ము గతి''**

అనే పంక్తులు "భరత ఖండంబు చక్కని పాడియావు'' అనే పద్యంలో వర్ణింపబడిన పాడియావు. లేగదూడలు. మూతులు బిగియబెట్టి అనేటటువంటి పదప్రయోగపోలికలు ఈ పై గీతంలో మనకు కనిపిస్తాయి. ''సుకవి జీవించు ప్రజల నాల్కలయందు'' అన్నట్లు ఆ పద్యం ద్వారా చిలకమర్తి వారికి విశేష ప్రాచుర్యం లభించడమేకాకుండా తెలుగువారి నాలుకలపైనా తేలియాడింది ఈ పద్యం.

అలాగే మద్రాసు నుండి (1886)లో వెలువడిన గట్టుపల్లి శేషాచార్యులు గారి "దేశాభిమాని" కొక్కండ వేంకటరత్నం పంతులు గారి "ఆంధ్రభాషాసంజీవని", (1871) ఎ.పి. పార్థసారధినాయుడు గారి "ఆంధ్రప్రకాశిక" (1886), మల్లాది వెంకటరత్నం గారి''తెలుగు జనానా" (1893), శ్రీ పాద కృష్ణమూర్తి శాస్త్రి గారి కళావతి (1899) మొదలైన పత్రికలు ఆరోజుల్లో తెలుగుప్రజల్లో సాంఘిక చైతన్యాన్ని, దేశాభిమానాన్ని జాగృతం చేయడానికి కృషి చేశాయి.

20వ శతాబ్దారంభంలో చిలకమర్తి లక్ష్మీ నరసింహం గారు "మనోరమ" (1906) "దేశమాత" (1910) వంటి పత్రికలను స్థాపించి జాతీయభావాలను ప్రచారం చేశారు.

జాతీయోద్యమ ప్రచారానికి పత్రికలు ప్రధాన సాధనాలని విశ్వసించిన "గాడిచర్ల హరిసర్వోత్తమరావు" 1908లో శ్రీబోడి నారాయణరావు (ప్రచురణకర్త) సహకారంతో "స్వరాజ్య" తెలుగు వార పత్రికను ప్రారంభించారు.

తెల్లదొరల అక్రమ, అన్యాయ చర్యలను తీవ్రంగా విమర్శిస్తు అనేక వ్యాసాలను వ్రాశారు. అందులో "అరెరె! ఫిరంగి క్రూర వ్యాఘ్రమా!" అనే శీర్షికతో వ్రాసిన వ్యాసం ఫలితంగా రాజద్రోహం నేరం క్రింద ప్రభుత్వం అరెస్టు చేసిన తొలి సంపాదకులు కూడ ఈ హరి సర్వోత్తమరావు గారే. బీద కుటుంబంలో జన్మించిన వీరు ఏ పదవినీ ఆశించకుండా "హిందుపత్రిక"కు సమీక్షలెన్నో వ్రాసి తమకు కావలసిన పైకాన్ని సమకూర్చుకునేవారు. త్యాగం, సేవ, దీక్ష మున్నగు గుణాలకు మూర్తిగా వెలిగిన "ఆంధ్రతిలక్"గా కీర్తి పొందారు.

10 మే, 1926న "సురవరం ప్రతాపరెడ్డి'' గారె గోల్కొండ పత్రికను ప్రారంభించారు. వారానికి రెండు సార్లు ఈ పత్రిక వెలువడేది. ఈ పత్రిక ఆంధ్రభాషా సేవ, జాతి, కుల వివక్షత లేక నిష్పక్షపాతంగా వ్యవహరించమే కాకుండా ప్రజలలో జాతీయ భావాలను ధైర్యంగా ప్రచారం చేసింది. తరువాత ఇది "దినపత్రిక"గా మారింది. 1951లో ప్రతాపరెడ్డి గారు పులిజాల హనుమంతరావుగారితో కలిసి "ప్రజావాణ'' దినపత్రికను స్థాపించి తెలుగు భాషాసేవ చేశారు.

IJRSSH

1897-98 మధ్యకాలంలో వివిధ పత్రికలలో దేశభక్తి ప్రబోధితాలైన పద్యాలు అనేకం వెలువరించారు. భారతీయులు దేశాన్ని తల్లిగా భావించి ఆరాధించడం జాతీయోద్యమ సాహిత్యంలో కనబడుతున్న విశిష్ట లక్షణం.

1921 నాటికే ''గరిమెళ్ళ సత్యనారాయ'' రాసినటువంటి దేశమాత స్తుతి గీతం.

**"వందనమిదే గైకొనుమీ భారతజనని**
**భారతజననీ మా పాలిట రాణీ"**

అని భారతీయుల నాలుకల మీద నాట్యం చేసింది.

అలాగే "మంగిపూడి" వారు సత్యాగ్రహోద్యమంలో అరెస్టయి జైలులో ఉన్నపుడు రచించిన

**"సతత భారత వీరసుతులయు**
**వితత సర్వార్పణోద్యతి మతినినీదరికి**
**కుతకమున వచ్చినామే తల్లీ''** అని వారు దేశమాత సేవ చేయడానికి సంకెళ్ళను

తెంచుటకై తాము ఎన్ని సార్లయినా సంకెళ్లను ధరించడానికి సిద్ధమే అని ప్రతిజ్ఞ పూనారు.

దేశమాతను స్తుతిస్తూ అనేక మంది కవులు ప్రఖ్యాత గీతికలను రాశారు. అందులో వేదుల సత్యనారాయణ, గురజాడ రాఘవశర్మ, కాటూరి వేంకటేశ్వరరావు, గురజాడ అప్పారావు, గరిమెళ్ళ, రాయప్రోలు, దేవులపల్లి కృష్ణశాస్త్రి మొదలైనవారు ప్రసిద్ధులు.

**"జయజయ భారత జననీ, పావని**
**జయజయ సకలానంద దాయినీ"**

అంటూ గురజాడ రాఘవ శర్మ గారు,

1914లో వెలువడిన రాయప్రోలు సుబ్బారావు గారు గానం చేసిన

**"ఏ దేశమేగినా ఎందుకాలిడిన**
**ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైన**
**పొగడరా నీతల్లి భూమి భారతి**
**నిలుపరా నీ జాతి నిండు గౌరవము.**
**లేరురా ఇటువంటి భూదేవి యెందు**
**లేరురా మనవంటి పౌరులింకెందు"**

అంటు ప్రారంభమైన ఈ గీతం జాతీయాభిమానానికి ఇంతకు మించిన నిదర్శనం మరొకటి లేదు.

ముత్యాలసరాలలో గొప్పరచన "గురజాడ" వారి దేశభక్తి గేయం.

**''దేశమును ప్రేమించుమన్నా**
**మంచి అన్నది పెంచుమన్నా**
**సొంత లాభం కొంతమానుకు**



IJRSSH

**పొరుగువాడికి తోడుపడవోయ్**

**దేశమంటే మట్టికాదోయ్**

**దేశమంటే మనుషులోయ్"**

"ప్రపంచకవులలో మహాకవి అని రుజువు కావడానికి ఈ దేశభక్తి గీతం చాలు" అని శ్రీశ్రీ చేత కీర్తించబడ్డారు అని అనడంలో గురజాడ వారి స్థానాన్ని తెలియజేస్తుంది.

దేశమాత స్తుతి గీతాల్లో తలమానికమైనది "దేవులపల్లి కృష్ణశాస్త్రిది" .

**"జయ జయ జయ ప్రియ భారత**

**జనయిత్రీ, దివ్య ధాత్రీ!**

**జయ జయ జయ శత సహస్ర**

**నరనారీ హృదయనేత్రి!"**

అంటూ ఆ మహాకవి దేశమాతకు నివాళులర్పించారు. దేశమాత స్తుతి గీతాలే కాదు పరపాలన తొలిగిపోవాలని ప్రజలను చైతన్యపరచడానికి బ్రిటిష్ పాలనను నిరసిస్తూ అనేక గీతికలను వ్రాసారు ఆనాటి కవులు.

"వానమమలై వరదాచార్యులు" గారు

**"పరదేశీయులు తొలగండి**

**ఈ భారతదేశం మా దేశం**

**వినండి వినండి విశ్వప్రజలూ**

**వీరభారత సందేశం"** అంటూ ప్రజలను చైతన్య పర్చారు.

"గరిమెళ్ల సత్యనారాయణ" గారు

**"మా కొద్దీ తెల్ల దొరతనము దేవ**

**మా కొద్దీ తెల్ల దొరతనమె**

**మా ప్రాణాలపై పొంచి - మానాలు హరియించే** || మాకొద్దీ ||

"గరికపాటి మల్లావధాని"గారు

**వద్దురా మనకొద్దురా - పరపాలనం బిక వద్దురా**

**హద్దు పద్దూ లేని పన్నుల - రుద్ది పీల్చుచునుండెరా** || వద్దురా ||

బ్రిటిష్ వారి పాలనను నిరసించిన ఈ గేయాలను పాడిన వారిని జైళ్ళకు పంపిందంటే ఈ గేయాల యొక్క ప్రాశస్త్యము తెలుస్తుంది.

గాంధీజీ గారి ఉపన్యాసాలతో ప్రభావితులై అనేకమంది రచయితలు సాధనాలుగా చేసుకుని జాతీయోద్యమానికి జవాన్ని, జీవాన్ని సమకూర్చారు. జాతీయోద్యమ కవుల వెనుక ఎంత తపస్సు, సాధన, నిష్ఠ, ఆవేదన, రోదన, దాగివుందో వారి గేయాల ద్వారా తెలియజేసి ప్రజలను చైతన్యవంతుల్ని చేశారనడంలో అతిశయోక్తి లేదు.



IJRSSH

ప్రజల స్వేచ్ఛా స్వాతంత్రాలకు భంగం కలిగితే రచయితలు సహించలేరని ఉత్తర ప్రాంతంలో ప్రేమ్ చంద్, వంగభూమిలో బంకించంద్ర చటర్జీ, బెంగాల్లో నజ్రల్ ఇస్లాం, తమిళంలో సుబ్రహ్మణ్య భారతి, మలయాళంలో శంకర్ కురూప్, సంస్కృతంలో గణపతి ముని, తెలుగులో ఉన్నవ లక్ష్మీనారాయణ, చిలకమర్తి, గురజాడ, గరిమెళ్ళ, మంగిపూడి మొదలైన అనేకమంది స్వాతంత్రోద్యమ సాహిత్యాన్ని సృష్టించడమే కాకుండా క్రియాశీలంగా ఉద్యమాల్లో పాల్గొన్నారు.

జాతీయోద్యమ గీతాలను, స్వాతంత్రోద్యమ గీతాలను విషయాన్ని బట్టి అనేక అంశాలుగా వర్గీకరించవచ్చు. అన్నీ గీతాలు ప్రధాన ధ్వని “స్వరాజ్య సాధనే” వివిధ అంశాల విభజన ఈ విధంగా ఉంది.

1) దేశస్తుతి 2) మేలుకొలుపు పాటలు 3) ఆంధ్రమాత స్తుతి 4) నాయకస్తుతి 5) నాయక స్మృతి 6) పంజాబ్ దురంతాలు 7) జాతీయ జెండాపై పాటలు మొదలైనవి.

## ఆధార గ్రంథాలు

1. తెలుగు అకాడమి - తెలుగు సాహితీ చైతన్య మూర్తులు

2. ఇలపావులూరి పాండురంగారావు - స్వాతంత్రోద్యమ గేయాలు (సంకలనం)

3. డా. ఎస్వీ సత్యనారాయణ - తెలుగులో ఉద్యమ గీతాలు

## BASIC TEXTS

1. Telugu Academy - Chaitanya Murtuli of Telugu Literature
2. Ilapavuluri Panduranga Rao - Songs of Freedom (Anthology)
3. Dr. SV Satyanarayana - Movement Songs in Telugu

IJRSSH